క్లుప్తంగా

మయబ్రహ్మ కార్యవర్గం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రిష్టాజీవాడిలో మయ బ్రహ్మ సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా వడ్ల నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా రంజిత్‌చారి, కోశాధికారిగా కిశోర్‌చారి, కార్యదర్శిగా బాలచంద్రం, సలహాదారులుగా శంకర్‌చారి, విశ్వనాథం, అరుణ్, నడిపి రాజులను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం వద్ద నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం గ్రామానికి చెందిన మేస్త్రీ శ్రీనివాస్ దంపతులు రూ.20,116లు విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ తెలిపారు. దాతల సహకారంతో రాజగోపుర నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, దసరా నాటికి గోపుర నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఆలయ ఈవో ప్రభ, ఆలయ అర్చకులు భావి శరత్ చంద్రశర్మ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప ఆలయం స్టీల్ గేట్‌కు..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయం స్టీల్ గేట్ నిర్మాణం కోసం లింగంపేట మండలంలోని ముంబోజిపేట గ్రామానికి చెందిన కొండం నర్సింలు శుక్రవారం విరాళం అందించినట్లు ఆలయ పూజారి శ్రీనివాస్ తెలిపారు. రూ.16 వేల విరాళంగా ఆలయ పూజారికి అందించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన రాధమ్మ కుటుంబానికి పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. రాధమ్మ కుమారుడు సుదర్శన్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమెకు నగదు సాయంతో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుభేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

గోమాతను ప్రేమించాలి



మద్నూర్(జుక్కల్): గోమాతను ప్రతి ఒక్కరు ప్రేమించాలని మద్నూర్ గోశాల అధ్యక్షుడు డిష్ సంజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గోశాలలో శుక్రవారం ఎల్లారెడ్డి ఎంపీవో ప్రసాద్, మాత్మల్ సర్పంచ్ ప్రకాష్‌రెడ్డిలు ఆవు, లేగదూడను దత్తత తీసుకున్నారు. దేశంలోని ప్రతి ఒక్కరు కనీసం ఒక్క ఆవును పెంచుకోవాలని సూచించారు. గోమాత దేవుడితో సమానమని ఆవును పెంచుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, గోశాల కమిటి సభ్యులు ఉన్నారు.

అన్నదానం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలాజీ జెండా వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ జెండాకు అర్చకులు, బాలాజీ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. శనివారం బాలాజీ జెండా మద్నూర్ నుంచి పయనమవుతుందని జెండా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి అవాల్‌గావ్, కొడిచిర గ్రామాల్లో పది రోజు లు ఉంచి అక్కడి నుంచి తిరుమలకు బాలాజీ జెండా తీసుకెళ్తామని అర్చకులు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీ జట్టుకు భిక్కనూరు విద్యార్థి ఎంపిక



భిక్కనూరు: రాష్ట్ర స్థాయి ఆర్చరీ జట్టుకు భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన అకుల్ ఎంపికయ్యారు. శుక్రవారం దోమకొండలో బుధవారం నిర్వహించిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో అకుల్‌ను సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ బూర్ల రేణుకుమార్, ప్రిన్సిపాల్ అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, నవీన్‌లు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అని బోర్డులు పెట్టి వైద్య పరీక్షలు చేస్తోన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు
- ఏడాది వయసున్న పసికందులకు సైతం వైద్యం చేస్తున్న వైనం
- పైల్స్ తగ్గిస్తామంటూ బోర్డుల ఏర్పాటు



పిట్లంలో ఆస్పత్రిగా చలామణి అవుతున్న ఫస్ట్‌ఎయిడ్ సెంటర్



ఆపరేషన్ లేకుండా పైల్స్ తగ్గిస్తామంటూ పిట్లంలో నిర్వహిస్తున్న ఆస్పత్రి

పిట్లం(జుక్కల్): పిట్లం మండలంలో వచ్చీరాని వైద్యంతో ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో వైద్య పరీక్షలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సరైన ధ్రువపత్రాలు లేకున్నా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. గతంలో పిట్లంలో సరైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఒక ప్రయివేట్ ఆస్పత్రిని అధికారులు సీజ్ చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు ప్రాథమిక వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం పారామెడికల్ బోర్డు ద్వారా గుర్తింపు ఇస్తుంది. స్థాయి మించకుండా వైద్యం చేసేందుకు ఇచ్చిన వెసులుబాటును కొందరు అతిక్రమిస్తూ ధనార్జనే ధ్యేయంగా అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పిట్లం మండలంలో పదుల సంఖ్యలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని పరిధికి మించి వైద్యం అందిస్తున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో ఏదైనా జరగరాని ఘటన జరిగితే వారు తమ పలుకుబడి, రాజకీయ అండదండలతో వెలుగులోకి రాకుండా చూసుకుంటున్నారు. పిట్లం వ్యాపారపరంగా అభివృద్ధి చెందడంతో పిట్లంతో పాటు పెద్దకొడపగల్, నిజాంసాగర్ మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్ తదితర మండలాల నుంచి ప్రజలు వైద్యం కోసం పిట్లం మండల కేంద్రానికి వస్తుంటారు.



ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి పసికందు మృతి చెందడంతో ధర్నా చేస్తున్న బాధితులు(ఫైల్)

కమీషన్లు దండుకుంటూ..

ఆర్‌ఎంపీ, పీఎంపీలు పెద్దాసుపత్రుల నిర్వాహకులు, ల్యాబ్ వారితో కమీషన్ మాట్లాడుకొని చిన్న జ్వరం వచ్చినా అవసరం లేని పరీక్షలన్నీ చేయిస్తున్నారు. మెడికల్ నిర్వాహకులతో కుమ్మక్కై, అవసరమున్నా లేకున్నా పెద్ద సంఖ్యలో ఔషధాలు రాస్తున్నారు. మరి కొంత మంది క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని గ్యారంటీ ట్రీట్‌మెంట్ అని ఆపరేషన్ లేకుండా పైల్స్ తగ్గిస్తామని, ఫిషరీస్, వరిబీజము, రక్త మొలలు తదితర రోగాలకు చికిత్స చేసి తగ్గిస్తామని రోగుల నుంచి రూ.వేలల్లో దండుకుంటున్నారు. మరి కొంత మంది చిన్నపిల్లల నిపుణులమని వైద్యం చేస్తున్నారు. మరి కొంత మంది ఆస్పత్రులు పెట్టి బయటి బోర్డులపైన పెద్ద డాక్టర్ల పేర్లు, డిగ్రీలు రాసి ప్రజలను మభ్యపెట్టి కాంపౌండర్లతో వైద్యం చేయిస్తున్నారు. సెలైన్‌లు ఎక్కిస్తున్నారు. ఇంజక్షన్‌లు ఇస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్ చేసిన వైద్యం వికటించి ఓ గిరిజన మహిళ మృతి చెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు శవంతో ఆస్పత్రి ముందు నిరసన చేశారు. ఆదే విధంగా మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వైద్యం వికటించి సుమారు 2 నెలల పసికందు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆర్‌ఎంపీ ఆస్పత్రి ముందు శవంతో నిరసన చేశారు. మండలంలో అడపాదడపా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్‌ఎంపీ, పీఎంపీలు, కాంపౌండర్‌లు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగుతున్నా రు. అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 24 గంటల పాటు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీల తీరుపై వైద్యాధికారి శివ కుమార్‌ను వివరణ కోరగా జరిగిన ఘటనలపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ



బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: దావల్‌మల్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బాబు కుటుంబానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం ప్రమాద బీమా చెక్కును అందించారు. బాబు చెట్టుపై నుంచి పడి మృతి చెందడంతో ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ తరపున మంజూరైన రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును బాధితుడి భార్య సాలమ్మకు ఎమ్మె ల్యే అందించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, ఎంపీటీసీ సంతోష్, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, తదితరులున్నారు. అలాగే అల్మాజీపూర్ గ్రా మానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పాశం రాంరెడ్డిని రాజంపేట ఆస్పత్రిలో ఎమ్మెల్యే పరామర్శించారు.

బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక

తాడ్వాయి(ఎల్లారెడ్డి): చిట్యాల, సంతాయిపేట్, దేమికలాన్, కన్‌కల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహేందర్‌రెడ్డి, ఎంపీపీ కొడి రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల పాఠశాల భవనం పరిశీలన



పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో రూ.6.7 కోట్లతో నిర్మించిన బీసీ బాలుర గురుకుల పాఠశాల భవనాన్ని శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయని శనివారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో కలిసి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఆయన వెంట నాయకులు శశికాంత్, మన్నాన్, అవారి గంగారాం, ఆరీఫ్ తదితరులున్నారు.

బాన్సువాడ: కామారెడ్డిలో శుక్రవారం వర్చువల్ విధానంలో సీఎం కేసీఆర్ ప్రారంభించిన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి బాన్సువాడ నియోజకవర్గం నుంచి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లారు. వాహనాలను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



మాసన్‌పల్లిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాసన్‌పల్లి పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని వసతుల గురించి ఆయన ఆరా తీశారు. దీంతోపాటు పోలింగ్ కేంద్రం పరిధిలోగల ఓటర్ల సంఖ్య వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సుభాష్ రెడ్డి ఉన్నారు.

రామారెడ్డి పరిధిలో..

రామారెడ్డి: మండలం కేంద్రం రామారెడ్డి, కన్నాపుర్, గొల్లపల్లి, రంగంపేట, పోసానిపేట్ గ్రామాల పోలింగ్‌స్టేషన్లలో మౌలిక వసతులను ఎంపీడీవో విజయ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఎంపీవోలు సవిత, ర్యాగెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి 'ఆయుష్మాన్ భారత్' సేవలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో ప్రతి ఇంటికి ఆయుష్మాన్ భారత్ సేవలు అందేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి సూచించారు. శుక్రవారం ఆమె లింగంపేట రైతు వేదికలో ఏర్పాటు చేసిన లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాలకు చెందిన వైద్య సిబ్బంది సమావేశంలో మాట్లాడారు. ఆరోగ్య సంరక్షణ సేవలు ప్రతీ వ్యక్తికి అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు, ఆరోగ్య మేళాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ఆయుష్మాన్ భారత్ సేవలు ప్రారంభమవుతున్నాయని, అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు, చికిత్స అందించడమే లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా అందరిని ఆరోగ్యంగా ఉంచడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు హిమ బిందు, సీహెచ్‌వో రమేశ్, యాదగిరి, నోడల్ అధికారులు రాణి, రుక్మిణీ, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సీజనల్ వ్యాధుల నివారణపై గోపాల్‌పేటలో శుక్రవారం ఎంపీవో శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వంజరి సునీతతో కలిసి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధులలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, దోమల నివారణ కోసం సాయంత్రం వేళ ఫాగింగ్ చేయించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్, తదితరులున్నారు.

టీబీ వ్యాధిపై ..



భిక్కనూరు: కాచాపూర్‌లో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ వ్యాధిగ్రస్తులు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని, ప్రభుత్వం వారి కోసం పౌష్టికాహారం అందిస్తోందని, ఉచితంగా మందులను కూడా అందజేస్తోందని టీబీ నివారణ అధికారి రాధిక అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పూజ, ఏఎన్‌ఎంలు శ్యామల, హేమలత, సూపర్‌వైజర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

'సదరం సర్టిఫికెట్లను మాత్రమే అనుమతించాలి'



కామారెడ్డి: దివ్యాంగుల పాయింట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులను మెడికల్ బోర్డు భౌతికంగా పరీక్షించి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జంగం శ్రీశైలం డిమాండ్ చే శారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... సదరం సర్టిఫికెట్లను మాత్రమే ప్రభుత్వం అనుమతించాలని, పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్లను మాత్రమే అనుమతిస్తున్న ప్రభుత్వం, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో మాత్రం మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు అనుమతించడం సరైన విధానం కాదన్నారు. దీని వల్ల నకిలీ సర్టిఫికెట్లు పుట్టుకొస్తున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని నిజమైన దివ్యాంగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తపాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న సిబ్బంది, ప్రజలు

బీబీపేట: తపాలా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కామారెడ్డి సబ్ డివిజన్ తపాలా శాఖాధికారి శ్రావణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తపాల శాఖ పథకాల గురించి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తపాల శాఖ పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, రికార్డింగ్ డిపాజిట్స్, సేవింగ్స్, గ్రామీణ తపాల జీవిత బీమా, తదితర పథకాల గురించి వివరించారు. ఐపీబీపీ మేనేజర్ పవన్ రెడ్డి, సబ్ పోస్టు మాస్టర్ నర్సింలు, తపాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపవాస దీక్షల విరమణ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మెల్లకుంటతండా జీపీ పరిధిలోని మహాదేవునిగడ్డతండాలో శుక్రవారం గిరిజనులు ఉపవాసదీక్షల విరమణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్, జగదాంబమాతల ఆలయాల వద్ద గిరిజనులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు ప్రత్యేకంగా తయారుచేసిన నైవేద్యాలను సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతలకు సమర్పించారు.

కళాశాల ప్రారంభోత్సవానికి తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



లింగంపేట నుంచి బయలుదేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు



నస్రుల్లాబాద్ నుంచి..

కామారెడ్డిలో మెడికల్ కళాశాలను సీఎం కేసీఆర్ వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభిస్తుండటంతో ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు మండలాల నుంచి భారీగా తరలి వెళ్లారు. ర్యాలీ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఒకే రోజు రాష్ట్రంలో తొమ్మిది మెడికల్ కళాశాలలు ప్రారంభించి దేశంలోనే తెలంగాణను అగ్ర భాగాన నిలిపారని అన్నారు. – సాక్షి నెట్‌వర్క్

సమ్మెకు అసోసియేట్ ప్రొఫెసర్ల మద్దతు



మద్దతు తెలుపుతున్న అసోసియేట్ ప్రొఫెసర్లు

భిక్కనూరు: కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సౌత్‌క్యాంపస్‌లో చేపట్టిన రిలే నిరసన దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్ష శిబిరంతో కూర్చుని నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుధాకర్‌గౌడ్, డాక్టర్ ప్రతిజ్ఞ మద్దతు తెలిపి మాట్లాడారు. కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. అలాగే సమ్మెకు పార్‌టైమ్ అధ్యాపకులు కనకయ్య, కిషన్ సునీల్‌లకు సంఘీభావం తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, రమాదేవి, నరసయ్య, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చాలి



నస్రుల్లాబాద్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు



ఎల్లారెడ్డిలో ..

తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరింది. సమ్మెకు బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు పలు సంఘాల నేతలు మద్దతు తెలిపి మాట్లాడారు. రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



రామారెడ్డి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మోహన్ రెడ్డి



పెద్దకొడప్‌గల్‌లో సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం

సమాచారం..

■ నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్, ఫత్లాపూర్, మాన్యాపూర్ గ్రామాలలో అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రారంభించనున్నారని ఎంపీపీ అశోక్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు తెలిపారు. జీపీ, కమ్యూనిటీ భవనాలు, హెల్త్ సెంటర్, మన ఊరు మనబడి పాఠశాలల భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందన్నారు.

■ పెద్దకొడప్‌గల్ బంద్‌కు పిలుపు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తమిళనాడు మంత్రి ఉదయ్ నిధి స్టాలిన్, హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నేడు పెద్దకొడప్‌గల్ మండలం బంద్‌కు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించాలని వారు కోరారు.

■ సమాజ కాంగ్రెస్ పార్టీ సమావేశం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో నేడు(శనివారం) ఉమ్మడి జిల్లాల తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ సభా కమిటీ కన్వీనర్ సిర్నాపల్లి శ్రీహరి శుక్రవారం తెలిపారు. కళాభారతిలో జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ ప్రిసీడియం చైర్మన్ డాక్టర్ పి.వినోద్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): పిట్లం ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 65 మందికి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశిరెడ్డి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడాలి

గాంధారి(ఎల్లారెడ్డి): హరితహారం పథకంలో నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడాలని ఎంపీడీవో సతీష్ అన్నారు. శుక్రవారం ఆయన పేట్‌సంగెం, మాతుసంగెం గ్రామాలను సందర్శించి పాఠశాలలు, ఎవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఇన్‌చార్జి ఏపీఎం హరిబాబు, ఉప సర్పంచ్ సంగారావు ఉన్నారు.

స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న మల్లికార్జున ఆలయ కమ్యూనిటీ హాల్ స్లాబ్ పనులను కౌన్సిలర్ ఉరుదొండ వనిత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ఉపాధ్యక్షుడు రాజుపాటిల్, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, గ్రామ పెద్దలు కాసర్ల రవీందర్, లద్దూరి లక్ష్మీపతియాదవ్, నిట్టు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో కైలాస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్, కాలభైరవ ఆలయ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. స్థానిక జేపీఎన్ చౌరస్తాలో ఈ కార్యక్రమం నిర్వహించారు.నాయకులు గోనే శ్రీనివాస్ తదితరులున్నారు.

లబ్ధిదారులకు గొర్రెలు..

బీబీపేట: ఇస్సానగర్‌లో శుక్రవారం రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యులు హేమశ్రీ ఆధ్వర్యంలో 18 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు జనగామలో 32 యూనిట్లు, మల్కాపూర్‌లో 30 యూనిట్లు, ఉప్పర్‌పల్లిలో 15 యూనిట్లు, ఇస్సానగర్‌లో 31 యూనిట్లు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ బాలమణి, రమణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్: కల్లు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ధర్నా వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు వెంకట్‌గౌడ్ తదితరులున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరామ్ నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొక్కలు నాటడం- భూసారాన్ని కాపాడటం అనే అంశంపై వ్యాసరచన పోటీ పెట్టామని, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. అలాగే మొదటి బహుమతి పొందిన విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అధ్యాపకులు వెంకట్రావ్, రాథోడ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.